



పురుగుమందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

'ఇంటికి వెళ్లేందుకు దారి కల్పించాలి'

పురుగుమందు డబ్బాలతో మహిళల నిరసన

8

కొత్త బంగారు లోకం



- విద్యార్థుల జీవితాలకు ఇంటర్మీడియట్ విద్యే కీలక మలుపు
- పాఠశాల దశ నుంచి స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగులు
- కొత్త స్నేహాలు.. కొత్త వాతావరణం.. కొంగొత్త ఆశలు...
- గాడి తప్పితే బతుకు గందరగోళమే..
- క్రమశిక్షణతో సాగితేనే విజయం తథ్యం
- వ్యసనాలకు దూరంగా ఉంటేనే లక్ష్య ఛేదన

'కొత్తగా రెక్కలొచ్చెనా..' అంటూ ఎగిరిపోయే దశ ఇంటర్మీడియట్. 'కాలేజీ స్టైలే..' అంటూ రెపరెపలాడే యవ్వనారంభ దశ ఇంటర్మీడియట్. పాఠశాల చదువుల పరిమితులను దాటి స్వేచ్ఛాలోకంలో విహరించే 'కొత్తబంగారు లోకం' అది. అందుకే అటు విద్యార్థులు, ఇటు తల్లి దండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. బలహీనతలను అధిగమించి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆటపాటలతో చదువునూ సీరియస్‌గా కొనసాగించాలి. కొత్త స్నేహాలు దారితప్పకుండా, తప్పుడు పనులకు దరి చేరకుండా జాగ్రత్తగా ఉండాలి. సెల్‌ఫోన్‌కు బానిస కాకుండా తమను తాము నిబాయించుకోవాలి. ఈ దశలో ఏమాత్రం అజాగ్రత్త వహించినా జీవితం గాడి తప్పుతుంది. లోయలో పడి మళ్లీ లేవకుండా అవుతుంది. తాము కళాశాలలో చేరామన్న ఉత్సాహం ఈ దశలో విద్యార్థులను గొప్పగా అనుకునేలా చేస్తాయి. కొత్త వాతావరణం, కొత్త ఆలోచనలు.. ఇవన్నీ యువ మనసుల్లో కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తాయి. ఈ ప్రయాణం సరికొత్తదైనప్పటికీ.. సరైన దిశగా సాగకపోతే భవిష్యత్తు సందిగ్ధంలో పడే ప్రమాదం ఉంది. ఇంటర్ విద్యార్థులారా.. బీ కేర్‌ఫుల్.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

7

కలల్ని సాకారం చేసుకునే దశ : ఎస్.శ్రీధర్‌సుమన్, డీఐఈవో, వరంగల్



కలలు సాకారం చేసుకునే దశ ఇంటర్. పాఠశాలలో ఎన్నో ఆశలతో పదో తరగతి పూర్తి చేసి, ఇంటర్ చేరే విద్యార్థులు.. వారి కలలతో పాటు వారి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాల్సి సమయం. విద్యార్థులు అడ్డదారులు తొక్కకుండా కాపాడాల్సిన బాధ్యత గురువులపై ఉంది. మంచి, చెడులను పిల్లలకు వివరిస్తూ.. సెల్‌ఫోన్ వినియోగం తగ్గించేలా తల్లిదండ్రులు దృష్టి సారించాలి. అవసరమున్న వరకే సోషల్ మీడియాను వాడనివ్వాలి.

ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయించండి

- మంత్రి రాజనర్సింహాకు ఎమ్మెల్యే మురళీనాయక్ విజ్ఞప్తి



హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


మహబూబాబాద్ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ నియోజకవర్గంలో నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలందించే ప్రభుత్వ ఆస్పత్రులకు మరిన్ని నిధులు కేటాయించి, అభివృద్ధి పర్చాలని స్థానిక శాసనసభ్యుడు భూక్య మురళీనాయక్ అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజ నర్సింహకు శనివారం మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యసేవల కోసం మారుమూల ప్రాంతాల నుంచి పట్టణాలకు రావడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, గూడూరు మండల కేంద్రంలో ఉన్న 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. తద్వారా ఆ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని పేర్కొన్నారు. స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ వీలైనంత త్వరగా ఆయా ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పాతబజారులో పలు కాలనీల్లో ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్జీవన్‌రాం కాలనీ, వ్యవసాయ మార్కెట్ ఏరియా, ముకుంద థియేటర్, ఫారెస్టు సెంటర్, అయ్యప్ప టెంపుల్ ఏరి యా, బెస్తబజార్, బస్టాండ్ రోడ్, రామచంద్రాపురం కాలనీ, ఏటిగడ్డతండా, గాయత్రిగుట్ట, డిగ్రీ కళాశాల, స్నేహనగర్, అంబేద్కర్ కాలనీ, ఆకుల లక్ష్మయ్యకాలనీ, హస్తీనపురం, నందనగార్డెన్ ఏరియాల్లో చెట్ల కొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

'అనారోగ్య' ఆహారం

- పుట్టగొడుగుల్లా ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీ సెంటర్లు
- రంగులు కలిపిన భోజన విక్రయాలు
- గాలికొదిలేసిన నాణ్యత
- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు
- తినొద్దని హెచ్చరిస్తున్న నిపుణులు





కనపడుతున్న దృశ్యం (ఫైల్)

మహబూబాబాద్ క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఫాస్ట్‌ఫుడ్, బిర్యాని సెంటర్లు విచ్చలవిడిగా వెలుస్తు న్నాయి. ప్రస్తుత ఆధునిక సమాజంలో పట్టణాలతో పాటు పల్లెల్లోనూ ఏర్పాటు అవుతున్నాయి. ఉరుకులు, పరుకుల జీవితంతో భార్యాభర్తలు ఉద్యోగాలకు వెళ్లడంతో నేడు ఇంట్లో తినుబండారాలు తయారు చేసుకోలేక ఫాస్ట్‌ఫుడ్, ప్రాశ్చాత్య ఆహారపు అలవాట్లకు అలవాటుపడుతున్నారు. వీటి వెనుక ఉన్న అనారోగ్య సమస్యలను గుర్తించలేకపోతున్నారు. రోగనిరోధక శక్తి తగ్గడానికి, అధిక బరువు పెరగడానికి, పెద్ద వయసువారిలో పొట్ట పెరగడానికి ఫాస్ట్‌ఫుడ్ ఇన్‌స్టెంట్ ఆహారమే కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా బిర్యానీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కుళ్లిన మాం సం, కాలం చెల్లిన రంగురంగులుగా కనిపించే సామగ్రితో ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీలు తయారు చేసి తక్కువ ధరకు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో కొందరు నిర్వాహకులు చెలగాటమాడుతున్నారు. సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేపట్టడంలో ఆంతర్యమేమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పుట్టగొడుగుల్లా బిర్యానీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు..

మానుకోట పట్టణంతో పాటు మండల కేంద్రాలు, మారుమూల ప్రాంతాలల్లో సైతం ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీ సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయి. మధ్యాహ్నం 2 దాటితే చాలు.. షాపుల్లో ప్రజలు దర్శనమిస్తున్నారు. ఆయా షాపు ల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యత పాటించడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు బిర్యానీ సెంటర్ల నిర్వాహకులు కుళ్లిపోయిన చికెన్‌ను సైతం బిర్యానీ చేస్తున్నారనడానికి నర్సింహులపేటలోని ఓ బిర్యానీ సెంటర్‌లో (మిగతా 8లో...)

రంగులు వేసిన ఆహారంతో ప్రమాదమే..

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో ప్రజల ఆహారపు అలవాట్లల్లో చాలా మార్పు వచ్చిందని చెప్పుకోవచ్చు. ఉద్యోగాల్లో బిజీబిజీ ఉండే ప్రజలు రంగులు వేసిన ఆహారం, ఫాస్ట్‌ఫుడ్ వైపు మొగ్గుచూపుతున్నారు. రంగులు వేసిన ఆహారంతో అనారోగ్యం పొంచి ఉందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్, ఎల్లో, సోయా సింథటిక్ కెమికల్ కలర్స్‌ను ఫుడ్‌లో వాడుతున్నారు. చికెన్ పకోడీ, జిలేబీ, నోరూరించే కారంలో రంగు, ఇలా చెప్పుకుంటూ పోతే తినుబండారాల్లో 90శాతం వరకు రంగులు వేసిన ఆహారమే! దీంతో ఆహారం సహజత్వాన్ని కోలుపోయి కలుషితమౌతోంది. దానిని భుజించడంతో మానవులు వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతారు.

ఫాస్ట్‌ఫుడ్ ఆరోగ్యానికి హానికరం..

- రాంరెడ్డి, జిల్లా ఆస్పత్రి వైద్యుడు



ఫాస్ట్‌ఫుడ్, రంగులు వేసిన ఆహారం ఆరోగ్యానికి హానికరం. ప్రధానంగా యువత ఫాస్ట్‌ఫుడ్ వైపు మొగ్గుచూపుతున్నారు. దీనివల్ల తలెత్తే అనారోగ్య సమస్యలను గుర్తించ లేకపోతున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధచూపి ఫాస్ట్‌ఫుడ్, బయట ఆహారానికి దూరంగా ఉండేలా చూడడం మంచిది.

స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్స్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాల్లో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్ క్రీడాఎంపిక పోటీల్లో అర్హులైన క్రీడాకారులు పాల్గొనాలని జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి శనివారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికారి సంస్థ 2025-26 విద్యాసంవత్సరంలో స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్స్‌లో ప్రవేశాలకు గచ్చిబౌలీ, ఎల్బీ స్టేడియంలలో హాకీ అకాడమీకి బాలురు-24, బాలికలు-24, అథ్లెటిక్స్ అకాడమీకి బాలురు-15, బాలికలు-15, ఎల్బీ స్టేడియం నందు హ్యాండ్‌బాల్ అకాడమీకి బాలురు-14, ఫుట్‌బాల్ అకాడమికి బాలురు- 24 ఎంపికలు జరుగుతాయని తెలిపారు. క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 12 నుంచి 16 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని, తెలంగాణ క్రీడాకారులై ఉండాలని, ఎస్ఎస్ఎఫ్ సబ్ జూనియర్ నేషనల్, ఎస్జీఎఫ్ఐ నేషనల్స్ మరియు స్టేట్ అసోసియేషన్ నిర్వహించే స్టేట్ లెవెల్ చాంపియన్ షిప్‌లలో పాల్గొన్న వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందన్నారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడల్లో పాల్గొన్న, గెలుపొందిన సర్టిఫికెట్లు, స్టడీ సర్టిఫికెట్ స్కూల్/కళాశాల నుంచి పొందినవి, జనన ధ్రువీకరణ పత్రం తహసీల్దార్ నుంచి కానీ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి కానీ పొం దినది, 10 పాస్ ఫొటోలు, ఆధార్‌కార్డు లేదా నివాస ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. జిల్లాకు చెంది అర్హులైన, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీడీపీని బలోపేతం చేస్తాం

- టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు యానాల అనంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న యానాల అనంతరెడ్డి

నెహ్రూసెంటర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్నామని పార్టీ రాష్ట్ర పరిశీలకుడు యానాల అనంతరెడ్డి పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పద్మశాలిభవనంలో శనివారం నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశం కొండపల్లి రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అధికారమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ హయంలోనే పేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందించామన్నారు. టీడీపీ పార్టీ అధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయకత్వంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు టీడీపీయే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందన్నారు. తెలంగాణలో మళ్లీ తెలుగుదేశం పార్టీని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రజా అవసరాలకనుగుణంగా తెలుగుదేశం పార్టీ వారి హక్కుల కోసం పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో బొమ్మ వెంకటేశ్వర్లు, భూక్య సునీత, సుతారపు వెంకటనారాయణ, ప్రేమ్‌చంద్‌వ్యాస్, వెంకన్న, పుల్లయ్య, భూక్య బాలు, విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం మహబూబాబాద్ అర్బన్, రూరల్ కమిటీలను ఎన్నుకున్నారు. అర్బన్ కమిటీ అధ్యక్షులుగా బొమ్మ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా తల్ల శ్రీనివాస్, రూరల్ కమిటీ అధ్యక్షులుగా బానోత్ హరికిషన్, ప్రధాన కార్యదర్శి కల్లెం మధుసూదనరెడ్డి ఎంపిక చేశారు.

వామ్మో.. మాకుల ఆలయ రోడ్డు!

- తల్లడిల్లుతున్న రైతులు



కంకర పోసి వదిలేసిన మాకుల ఆలయ రోడ్డు

మరిపెడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన మరిపెడ మాకుల ఆలయ రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ప్రజలు, పశుసంపద ఆ రోడ్డుపై నడకతో తల్లడిల్లుతున్నారు. గత మూడేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం మరిపెడబంగ్లా నుంచి మాకుల ఆలయం వరకు రూ.80 లక్షలతో తారు రోడ్డు మంజూరి చేసింది. ఆ రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ స్థానిక ఇందిరానగర్ నుంచి మాకుల పెద్ద చెరువు అలుగు వరకు పనులుచేసి, మిగతా పనులు కంకర పరిచి నిలిపివేశారు. దీంతో గత రెండేళ్లుగా పరిచిన కంకరపై రైతులు, వారి పశువులు, గొర్రెలు, మేకలు నిత్యం నడవలేక నరకం భరిస్తున్నాయి. పశువులు, గొర్రెలు, మేకలు డెక్కలు పలిగి రక్త స్రావంతో వణికిపోతున్నాయి. సదరు గుత్తేదారు చేసిన పనికే మూడేళ్లయైన బిల్లులు రాలేదని తెలుస్తుంది. ఆ బిల్లులు ఇస్తేనే మిగత పనులు పూర్తి చేసే యోచనతో ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఓ వైపు మాకుల పెద్ద చెరువు బ్యూటీషన్ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయ్యేలోపు ఆ రోడ్డు పనులు పూర్తయితేనే మాకుల చెరువుకు పర్యాటక సొగసులు వస్తాయని స్థానికులు గుర్తు చేస్తున్నారు. అప్పటికైనా రోడ్డు పనులు పూర్తి చేస్తారో లేదోనని ప్రజల నుంచి సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

డయల్ యువర్ డీఎంకు అపూర్వ స్పందన



మహబూబాబాద్ టౌన్, జూలై 12 : మానుకోట ఆర్టీసీ డిపో నుంచి శనివారం డయల్ యువర్ డీఎం ప్రోగ్రాంను నిర్వహించారు. ఇందులో ప్రయాణికులు, ప్రజలు ఫోన్ ద్వారా తమ సలహాలు, సూచనలు ఆర్టీసీ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా డీఎం శివప్రసాద్ మాట్లాడు తూ తొమ్మిది మంది ప్రయాణికులు డయల్ యువర్ ప్రోగ్రాంలో పాల్గొని సూచనలు చేశారని చెప్పారు. మహబూబాబాద్ నుంచి కురవి మండలం నల్లెలకు షటిల్ సర్వీస్ కావాలని, మహబూబాబాద్ నుంచి మరిపెడ- బంగ్లా మీదుగా హైదరాబాద్‌కు బస్సు నడిపించాలని ప్రజలు కోరారని చెప్పారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులు

తొర్రూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులు నడుపుతుందని తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్ పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీన తొర్రూరు డిపో నుంచి కర్ణాటకలోని బీదర్‌కు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని, అక్కడ సంగమేశ్వర స్వామి టెంపుల్, జైన్ టెంపుల్, లక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయం, బీదర్ కోట తదితర ప్రాంతాలను సందర్శించుకుని 21వ తేదీన తిరిగి ప్రయాణీకులను తొర్రూరుకు తీసుకొస్తారని, దీనికి పెద్దలకు రూ.2000, పిల్లలకు రూ.1200 టికెట్ ధర నిర్ణయించామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 99592 26053 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్టు

ఏటూరునాగారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తున్న ఓ మహిళను ములుగు జిల్లా ఏటూరునాగారం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. యువతకు విక్రయించేందుకు గంజాయిని తీసుకొస్తుండగా పోలీసులు ఏటూరునాగారంలో చాకచక్యంగా పట్టుకున్నారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి నుంచి మండల కేంద్రంలోని యువతకు గంజాయి విక్రయించేందుకు తరలిస్తున్నారనే సమాచారం పోలీసుకలు అందింది. దీంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద మాటు చేశారు.

ఈ క్రమంలో చిన్న బోయినపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కె.నిఖత్ స్కూటీపై గంజాయిని తీసు కొస్తుండగా పోలీసులకు పట్టుబడింది. వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా, హనుమకొండకు చెందిన వాహదుల్లా అనే వ్యక్తి వద్ద రెండు రోజుల క్రితం గంజాయి కొనుగోలు చేసి ఏటూరునాగారంలో విక్రయించేందుకు వచ్చినట్లు తెలిపింది. నిందితురాలి వద్ద నుంచి 230 గ్రాముల ఎండు గంజాయి, ఒక స్కూటీ, ఒక సెల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ అనుములు శ్రీనివాస్ ఆ మహిళను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

జాగిలంతో పోలీసుల ముమ్మర తనిఖీలు



జాగిలంతో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

గోవిందరావుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపేట మండలకేంద్రంలో పస్రా ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శనివారం నార్కోటిక్ స్నైపర్ జాగిలంతో బస్టాండ్, చౌరస్తా, కిరాణాషాపులు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ ప్రత్యేక శిక్షణ పొందిన స్నైపర్ జాగిలం హత్యలు, దోపిడీల చిక్కుముడులను విప్పడానికి, గంజాయి, డ్రగ్స్, పేలుడు పదార్థాలను పసిగట్టి పట్టించడం జరుగుతుందని అన్నారు. పోలీసుల అవసరాలకు తగ్గట్టు జాగిలాలను వినియోగించడం జరుగుతుందని పేర్కొన్నారు. నిత్యం ప్రతిరోజు మండలంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టడం జరుగుతుందని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే ఎస్పీ ఉద్దేశమని అన్నారు. గ్రామీణ ప్రాంత యువత మత్తుపదార్థాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి వంటి మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్న వ్యక్తులకు సమాచారాన్ని పోలీసులకు తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు కట్టలకు మరమ్మతులేవి?

● గతేడాది కొట్టుకుపోయిన వాటికి దిక్కులేదు

● మళ్లీ వర్షాకాలం వచ్చినా స్పందించని అధికారులు

● ఆందోళనలో అన్నదాతలు

మరిపెడ రూరల్ (మహబూబాబాద్ జిల్లా), జూలై 11 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం అక్టోబర్ మాసంలో వచ్చిన తుఫాను తాకిడికి మరిపెడ మండలంలో సుమారు 15 చెరువు కట్టలు కొట్టుకుని పోయాయి. ఈ సంవత్సరం జూలై మాసం వచ్చి వర్షాకాలం ఆరంభమైనప్పటికీ చెరువు కట్టలకు మరమ్మతులు చేయకపోవడంతో రైతాంగం ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని గిరిపురం పెద్ద చెరువు, బీచ్‌రాజ్‌పల్లి చెరువు, జర్పుల తండాలోని పెద్ద చెరువు, గుండెపూడిలోని చెరువు తదితర గ్రామాల్లోని చెరువు కట్టలు పూర్తిగా తెగిపోగా, మరికొన్ని స్వల్పంగా తెగిపోయాయి. దీంతో చెరువు ఆయకట్టు ప్రాంతంలో వేలాది ఎకరాల భూమిలో సాగు చేస్తున్న వందలాది మంది రైతులు ఆందోళన వ్యక్తపరస్తున్నారు. వర్షాకాలం వచ్చి వర్షాలు కురుస్తున్నప్పటికీ చెరువులు ఎప్పుడు నిండుతాయేనని బయపడుతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడితో రైతులు దుక్కులు దున్నుకుని, విత్తనాలు నాటుకున్నారు. ఒక వేళ చెరువు కట్టల మరమ్మతులు చేయకపోతే, అవి నిండి అలుగులు పోస్తే తమ పంట పొలాలు సర్వనాశనమైపోతాయేమోనని దిగాలు వ్యక్త పరుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తెగిపోయిన చెరువు కట్టలకు మరమ్మతులు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.



గత సంవత్సరం వచ్చిన తుఫాన్‌కు కొట్టుకుపోయిన గిరిపురం పెద్ద చెరువు కట్టపై ఉన్న రోడ్డు

త్వరలోనే మరమ్మతులు చేపడతాం..

గత సంవత్సరంలో వచ్చిన తుఫాన్‌కు మండలంలో సుమారు 15 చెరువు కట్టలు తెగిపోయాయి. చెరువు కట్టలకు మరమ్మతులు చేసేందుకు ఎఫ్‌డీఆర్ నిధుల కింద మరమ్మతులు అతి త్వరలోనే చేయించడం జరుగుతుంది. గిరిపురం పెద్ద చెరువు ఆయకట్టుకు రూ 2.5 లక్షలతో మరమ్మతులు చేపిస్తున్నాం.

- నరేందర్, ఐబీ ఏఈఈ, మరిపెడ

రిజర్వేషన్లు ఖరారయ్యాయంటూ ప్రచారం

● జడ్పీటీసీ రిజర్వేషన్లపై వాట్సాప్‌లో పోస్టులు ● తప్పుడు ప్రచారమంటూ కొట్టిపారేసిన అధికారులు

కేసముద్రం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇదిగో తోక అంటే...అదిగో పులి అన్నచందంగా మారింది... సామాజిక మాధ్యమాల్లో కొంతమంది వ్యవహారం. రాష్ట్రంలో ఓ పక్క స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశం ఆర్డినెన్స్ జారీ చేసే ప్రక్రియలోనే ఉండగా...మహబూబాబాద్ జిల్లాలో జడ్పీటీసీ రిజర్వేషన్లు ఖరారయ్యాయంటూ రెండు రోజులుగా వాట్సాప్‌లో ఒక జాబితా చక్కర్లు కొడుతోంది.

ఇందులో ప్రభుత్వం పేరు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా వచ్చినట్లు జిల్లా పరిషత్ ఎన్నికల్లు-2025 అని శీర్షికల్లో చేర్చడమేకాకుండా మండలాల వారీగా జడ్పీటీసీ స్థానం ఏ వర్గానికి రిజర్వు అయిందని స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో అంతా ఇదే నిజమేననుకొని తమకు తోచిన గ్రూపుల్లోకి షేర్ చేస్తున్నారు. ఇందులో పేర్కొన్న రిజర్వేషన్లు చూసుకొని ఆయా వర్గాల వారు తాము అనుకున్న రిజర్వేషన్ వచ్చిందని కొందరు లోలోపల సంబరపడిపోతుండగా తమకు అనుకూలంగా లేదని అసలు ఇదే వాస్తవమేనా? అని సందేహంతో వాకబు చేస్తున్నారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' జిల్లా పరిషత్ అధికారులను సంప్రదించగా అది తాము విడుదల చేసిన వివరాలు కావని, అసలు జిల్లాలో జడ్పీటీసీల రిజర్వేషన్ల అంశం ఇంకా ఖరారు చేయలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఉత్తర్వుల ఆధారంగా రిజర్వేషన్ల కేటాయింపులు ఉంటాయని వెల్లడించారు. ఏదేమైనా సామాజిక మాధ్యమాల్లో మాత్రం ఈ జాబితాను కొందరు ఔత్సాహికులు షేర్ చేస్తూనే ఉన్నారు.



వాట్సాప్‌లో చక్కర్లు కొడుతున్న జడ్పీటీసీ రిజర్వేషన్ల జాబితా

యువకుడి ఆత్మహత్య

బయ్యారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సాంభతండాకు చెందిన విజయ్ (24) కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 10వ తేదీన మూర్ఛ వచ్చి అవస్థపడటంతో మనోవేదనతో జీవితంపై విరక్తిచెంది పాయిజన్ తీసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు, గ్రామస్థులు విజయ్‌ని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయ్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి అక్క దీప్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బెండతోట ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

డోర్నకల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :డోర్నకల్ మండలం కస్నాతండ గ్రామపంచాయతీ పరిధిలోని చిమ్నాతండాకు చెందిన ఓ రైతు అర ఎకరంలో బెండతోటను ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చిమ్నాతండాకు చెందిన గుగులోతు పులియా అనే రైతు అదే తండాలోని శంకర్, సుధాకర్‌లకు చెందిన కొంత భూమిని కొనుగోలు చేశాడు. అందులో బెండతోటను సాగు చేశాడు. అయితే ఆ భూమి తనదంటూ గుగులోతు శంకర్ అనే వ్యక్తి పులియా సాగు చేసిన బెండతోటను కొంతమేర ధ్వంసం చేశాడు. దీంతో పులియా డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో శంకర్‌పై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమ తెలిపారు.

రెండు ఇళ్లల్లో చోరీకి యత్నం

గణపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు ప్రశాంతినగర్ కాలనీలోని రెండు ఇళ్లల్లో దొంగలు చోరీకి యత్నించిన ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. తన ఇంట్లో ఉగ్గిలి ఉమామహేశ్వరరావు నిద్రిస్తుండగా కిటికీ నుంచి శబ్దాలు వినిపించాయి. ఎవరని అవరవగా దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. అదే కాలనీలో శుక్రవారం రాత్రి కెక్కర్ల రాజు ఇంట్లో కూడా దొంగలు చోరీకి యత్నించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందింది.

బాత్‌రూంలోనే నివాసం

ఓ వృద్ధురాలి పరిస్థితి దయనీయం

వెంకటాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జీవనం సాగించడానికి ఆదరువు లేకపోవడం, కనీసం పూరి గుడిసె లేక ఓ వృద్ధురాలు బాత్‌రూంలో నివాసం ఉంటున్న దయనీయ పరిస్థితి ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో కనిపించింది. పాలెం గ్రామంలో పాయం సమ్మక్క అనే వృద్ధ మహిళ కొన్నేళ్లుగా బాత్‌రూంలోనే నివాసం ఉంటోంది. మూడేళ్ల క్రితం చిన్న పూరి గుడిసెలో నివాసం ఉన్న సమ్మక్క ఆ ఏడాది భారీ వర్షాలు పడడంతో గోదావరి వరదల్లో ఇల్లు మునిగిపోయింది. దీంతో ఎవరూలేని సమయంలో ఇల్లు కుప్పకూలిపోవడంతో అప్పటి నుంచి బాత్‌రూంలోనే నివాసం ఉంటోంది. కనీసం ఉండడానికి ఇల్లు లేకపోవడంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నిర్మించిన బాత్‌రూంలోనే సమ్మక్క మూడేళ్లుగా నివసిస్తోంది. అక్కడే వండుకోవడం, తినడం, పడుకోవడం చేస్తోంది. బాత్‌రూంనే ఇల్లుగా చేసుకుని దయనీయంగా జీవనం సాగిస్తోంది. సమ్మక్క భర్త పదేళ్లక్రితం మృతిచెందాడు. కుమార్తెకు పదేళ్లక్రితం వివాహం చేయగా ఆమె సుదూర ప్రాంతానికి వెళ్లిపోవడంతో బాత్‌రూంలోనే సమ్మక్క ఒంటరిగా జీవిస్తోంది. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తనకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆమె కోరుతోంది.



బాత్‌రూంలో నివాసం ఉంటున్న సమ్మక్క

విహారయాత్రకు వరంగల్ డిపో నుంచి ప్రత్యేక బస్సు

హనుమకొండ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విహార యాత్రకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం కోసం వరంగల్-1 డిపో నుంచి ఆదివారం ప్రత్యేక డీలక్స్ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం డి.విజయభాను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు హనుమకొండ బస్టాండ్ నుంచి బయల్దేరి మల్లూరు శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆలయం, బొగత జలపాతం, లక్నవరం సరస్సు, రామప్ప శ్రీరామలింగేశ్వర దేవాలయానికి ప్రత్యేక డీలక్స్ బస్సు వెళ్తుందని, ప్రయాణికులు విహార యాత్రకు వెళ్లే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఒక్కరికి రూ.650 ఉంటుందని తెలిపారు. ఒక్కో డీలక్స్ బస్సులో సుమారు 40మంది ప్రయాణికులకు సీట్ల పరిమితి ఉంటుందని, ఈ ప్యాకేజీ టూర్‌కు వెళ్లే వారు సెల్‌నంబర్లు: 9063407493 / 7780565971లకు సంప్రదించాలని కోరారు.

ఔట్‌సోర్సింగ్ కండక్టర్ల నియామకాల్లో వసూళ్లు

ఒక్కో పోస్టు రూ.లక్ష పలుకుతున్నట్లు ఆరోపణలు

హనుమకొండ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో కండక్టర్ల నియామకాల్లో బేరాల జోరు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సిబ్బందిపై పనిభారం తగ్గించేందుకు ఆర్టీసీ సంస్థ ఔట్‌సోర్సింగ్ ద్వారా కండక్టర్లను నియమించుకుంటోంది. వరంగల్ రీజినల్ పరిధిలోనే హనుమకొండ డిపో, వరంగల్-1 డిపో, భూపాలపల్లి డిపో, పరకాల డిపో, నర్సంపేట డిపో, జనగామ డిపో, తొర్రూరు డిపోల పరిధిలో సుమారుగా 120మందిని ఔట్ సోర్సింగ్ ద్వారా కండక్టర్ పోస్టులను భర్తీచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఒక్కో డిపోలో 5 నుంచి 10 మంది కాంట్రాక్టర్లు ఔట్‌సోర్సింగ్ టెండర్‌ను దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. డిసెంబరు వరకు ఆరునెలల కాల వ్యవధిలో కండక్టర్లను నియమించే క్రమంలో కొందరు కాంట్రాక్టర్లు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు కొంతమంది చెబుతున్నారు. అయితే కాంట్రాక్టర్లు డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినప్పటికీ ఆరునెలల ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగం కోసం భారీగానే డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను తమ సిఫారసు ఉంటేనే తీసుకోవాలని, లేకుంటే కాంట్రాక్టర్‌పై, ఆర్టీసీ అధికారులపై కొందరు ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకొస్తున్నట్లు చెబుతున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకంలో గతంలోకూడా కొంతమంది కాంట్రాక్టర్లు అమాయక నిరుద్యోగుల వద్ద పర్మినెంట్ ఉద్యోగాలు అంటూ నమ్మించి డబ్బులు వసూలు చేసినట్టు తెలిసింది.

కళకళలాడిన హేమాచల క్షేత్రం

మంగపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి సన్నిధి శనివారం కళకళలాడింది. భక్తులు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర సూదూర ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. సుమారు 15 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయ స్వామి, పంచముఖాంజనేయ స్వామి, వేణుగోపాల స్వామి, రమ సత్యనారాయణ స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపై లక్ష్మీనరసింహస్వామిని, పక్కనే కొలువుదీరిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలను దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ, విశ్రాంత ప్రధానార్చకుడు కైంకైర్యం రాఘవాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, అనిపెద్ది మురళీకృష్ణ శర్మ, వెంకటనారాయణ శర్మ, రాజీవ్‌నాగశర్మ భక్తులకు దైవ దర్శనాలు గావించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. లక్ష్మీనరసింహస్వామిని ములుగు ఎస్పీ శబరీశ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన వెంట ఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, మంగపేట ఎస్సై సూరి ఉన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ములుగు ఎస్పీ దంపతులు

కేయూ భూములలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మించాలి

● వీసీ ప్రతాప్‌రెడ్డికి విద్యార్థి సంఘాల స్పష్టీకరణ

● ఎన్ఎస్‌యూఐతో పాటు ఇతర విద్యార్థుల ప్రదర్శనలు

కేయూ క్యాంపస్ జూలై 12, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మించాలని ఎన్ఎస్‌యూఐ, బీఎస్ ఎఫ్, పీడీఎస్‌యూ, టీజీవీపీ, టీటీఎస్‌ఎఫ్, టీఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎంవీవీ, ఎస్ఎస్‌బీఎం, ఎన్ఎస్ఎఫ్, యూఎస్ఎఫ్ఐ, బీసీ సంఘం, ఎస్ఎస్‌బీఎం, కేయూ పీహెచ్‌సీ నేతలు ప్రదర్శనలు చేపట్టారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలను కలిసి వర్సిటీ క్యాంపస్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని కోరుతున్నారు. ఈ మేరకు వర్సిటీలో ఎన్ఎస్‌యూఐ, బీఎస్ఎఫ్, పీడీ ఎస్‌యూ, టీజీవీపీ, టీటీఎస్ఎఫ్, టీఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎంవీవీ, ఎస్ఎస్‌బీ ఎం, ఎన్ఎస్ఎఫ్, యూఎస్ఎఫ్ఐ, బీసీ సంఘం, ఎస్ఎస్‌బీఎం. కేయూ పీహెచ్‌సీతో పాటు తదితర విద్యార్థి సంఘాల నేతలు కేయూ పరిపాలన భవనం ఎదుట స్కూల్‌ను ఏర్పాటు కోసం ప్రదర్శనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ.. కేయూలో ఇంటి గ్రేటెడ్ స్కూల్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పారు. పేద విద్యార్థుల భవి ష్యత్ కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అడ్డుకోవద్దంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. గత బీఆర్ఎస్ హయాంలో వర్సిటీలను నిర్వీర్యం చేసి కబ్జాలకు పాల్పడ్డారని విద్యార్థి సంఘాల నేతలు విమర్శించారు. అలాగే ప్రైవేట్ వర్సిటీలను తెచ్చారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అనుబంధ విద్యార్థి సంఘానికి వర్సిటీలపై మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. తక్షణమే వర్సిటీ భూముల్లోనే స్థలం కేటాయించి పనులు ప్రారంభించాలని ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. స్కూల్‌కు మద్దతుగా జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న వారిలో విద్యార్థి సంఘాల నేతలు డి.సారయ్య, వంశీకృష్ణ, మేడ రంజిత్‌కుమార్, డాక్టర్ రాజునాయక్, కన్నం సునిల్, బొట్ల మనోహర్, కడపాక రాజేందర్, సాయి కృష్ణసీహెచ్ సుమన్, కేతపాక ప్రసాద్, ఎం.ప్రదీప్, జె.రవి, ఎం.రాజు, యూత్ కాంగ్రెస్ స్టేట్ జనరల్ సెక్రటరీ అలువాల కార్తీక్, రాకేశ్‌కృష్ణ, లోక్‌నాయక్, సొరం రాహుల్ వర్ధన్, బి.నాగరాజుతోపాటు వర్సిటీ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొంటున్నారు.

ఆప్షన్ల ఎంపికలో ఆగమాగం

- వాచ్‌మన్, డ్రైవర్, స్వీపర్లకు జిల్లాల కేటాయింపులో గందరగోళం
- అవగాహన కల్పించాలంటున్న ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు



రాంనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాల విభజన తర్వాత 2018లో ఎన్పీ డీసీఎల్‌లోని పలువురు ఉద్యోగుల విభజన జరిగినప్పటికీ కిందిస్థాయి ఉద్యోగు లైన స్వీపర్లు, వాచ్‌మన్, డ్రైవర్లను విభజన చేయకుండా జాప్యం చేశారు. ఈ క్రమంలో ఇద్దరు సీఎండీలు, స్వీపర్, వాచ్‌మన్, డ్రైవర్ల బైపర్‌కేషన్ కమిటీ చైర్మన్లుగా ఉన్న ముగ్గురు వ్యక్తులు మారారు. ఏడేళ్ల తర్వాత ఎట్టకేలకు ఇటీవలే కిందిస్థాయి ఉద్యోగులను విభజన చేసేందుకు ఎన్పీడీసీఎల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఆయా ఉద్యోగులు ఏఏ జిల్లాలకు వెళ్లాలో తెలిపే ఆప్షన్ ఫారమ్‌లో గందరగోళం ఏర్పడింది. గతంలో 2018లో ఉద్యోగుల విభజన జరి గినప్పుడు జిల్లాల్లో ఉన్న ఖాళీలతో పాటు జిల్లాల పేర్లను ఆప్షన్‌లలో చూపిం చి, ఆప్షన్స్‌ను ఎలా ఎంచుకోవాలి..? అనే దానిపై ఉద్యోగులకు ఒక రోజు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించి ఆప్షన్స్‌కు అవకాశం ఇచ్చారు. కానీ ప్రస్తుతం అప్పుడు ఉన్న వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, ప్రస్తుతం వరంగల్, హనుమకొండ జిల్లాలుగా మారాయి.

అదేవిధంగా అప్పుడు భూపాలపల్లి జిల్లా నుంచి ములుగు జిల్లా ఏర్పడింది. దీనిపై ఎన్పీడీసీఎల్ యాజమాన్యం కింది స్థాయి ఉద్యోగులకు ఎలాంటి స్పష్టత, అవగాహన కల్పించకుండా జిల్లాల ఆప్షన్స్ అని ఇచ్చి కింద వరుసగా ఐదు నెంబర్లు ఇవ్వడంపై కిందిస్థాయి ఉద్యోగులు అయోమయానికి గురవుతున్నారు. 2018లో ఉద్యోగుల బదిలీలు జరిగినప్పుడు ఉన్న వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాలు ఇప్పుడు హనుమకొండ, వరంగల్‌గా మారడంతో ఆప్షన్‌లో పాత జిల్లాల పేర్లు పెట్టాలా..? లేదా కొత్త జిల్లాల పేర్లు రాయాలా..? అనే దానిపై కింది స్థాయి ఉద్యోగులు అయోమయానికి గురవుతున్నారు.

తమకు కంటే పైస్థాయి ఉద్యోగులకు ఆప్షన్‌లపై ఎంపికపై అవగాహన కల్పించి తమ లాంటి కింది స్థాయి ఉద్యోగులకు అవగాహన కల్పించకపోవండపై వాచ్‌మన్, డ్రైవర్లు, స్వీపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైపర్‌కేషన్ కమిటీ చైర్మన్, కన్వీనర్లు విభజనపై ఎలాంటి అవగాహన కల్పించకుండా ముందుకెళ్తున్నారని కొంత మంది కిందిస్థాయి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. 2018 నిబంధనల ప్రకారమే ప్రస్తుతం ఉద్యోగుల విభజన చేస్తున్న క్రమంలో వరంగల్, హనుమకొండ, ములుగు జిల్లాల ఆప్షన్‌ల విషయంలో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించిన తర్వాతే ఆప్షన్‌లను స్వీకరించాలని పలువురు బాధిత ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఎన్పీడీసీఎల్ యాజమాన్యాన్ని కోరుతున్నారు.

కొత్త బంగారు లోకం..

- విద్యార్థుల జీవితాలకు ఇంటర్మీడియట్ విద్యే కీలక మలుపు
- గాడి తప్పితే బతుకు గందరగోళమే..
- క్రమశిక్షణతో సాగితేనే విజయం తథ్యం

సండే స్పెషల్ SUNDAY SPECIAL

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 35,409 మంది ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉన్నారు. వరంగల్, హనుమకొండ లాంటి మహానగరంలో.. కౌమార దశలో ఆకట్టుకునే అనేక అంశాలు కళ్ల ముందుకు వస్తాయి. ఇంటర్మీడియట్ దశ విద్యార్థుల జీవితంలో తొలి స్వాతంత్ర్య అనుభూతికి దారి తీస్తుంది. ప్రధానంగా కళాశాలలో చేరగానే కొత్త పరిచయాలు, కొత్త వాతావరణం, కొత్త స్నేహితులు దగ్గరవుతారు. వారితో కలిసిపోయేందుకు వారి ఇష్టాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి. తల్లిదండ్రులకు దూరంగా ఉండటంతో పాటు వారి ప్రాంతాల్లో దొరకని సినిమాలు, జూదం,ప్రేమ, పర్యాటక ప్రాంతాల సందర్శన వంటివి త్వరగా త్వరగా ఆకర్షిస్తాయి. నయా మాడల్స్, రంగురంగుల దుస్తులు కూడా విద్యార్థులపై ప్రభావం చూపుతాయి. రోజు కాలేజీకి రాకపోకలు కూడా కొత్తగా అనిపిస్తాయి.

చదువు.. సమయానికే ప్రాధాన్యత

ఇంటర్ దశ ప్రతీ విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైనది. ఇక్కడ జీవితం ఎటువైపు మొగ్గుచూపితే భవిష్యత్తు అలాగే ముందుకు వెళుతుంది. ఇంటర్మీడియట్‌లో ఎన్ని ఆకర్షణలు కళ్లముందు ఉన్నా, విద్యార్థుల తొలిప్రాధాన్యత చదువుకే ఇవ్వాలి. విధిగా తరగతులకు హాజరుకావటంతో పాటు పాఠ్యాంశాలపై దృష్టి పెట్టాలి. ఆధ్యాపకులు చెప్పే పాఠం అర్థం కాకపోతే మరోసారి అడిగి తెలుసుకోవడానికి సంకోచించవద్దు. ప్రతీ రోజు అధ్యాపకులు చెప్పే పాఠాన్ని రన్నింగ్ నోట్స్‌లో రాసుకోవాలి. పోటీ పరీక్షలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవడం, స్నేహితులతో కలిసి గ్రూపు స్టడీ చేయటం ప్రయోజనకరంగా ఉంటుంది. ఇక సెలవులు వస్తే.. టీవీలకు, సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోతున్నారు. దీంతో సమయం వృథా అవుతుంది. సెల్‌లో ఆడే ఆటలతో కనీసం శారీరక శ్రమ కూడా ఉండటం లేదు. పైగా మానసికంగా కుంగతీస్తాయి. సెలవు దినాలను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక ఉండాలి. మనసును ఉల్లాసపరిచే క్రీడలు, లైబ్రరీలో పుస్తక పఠనం, స్నేహితులతో చదువుకు సంబంధించిన సబ్జెక్టులపై చర్చ, శ్రుతిమించని వినోదం ఆహ్లాదంతోపాటు జీవితాన్ని ఆనందమయం చేస్తాయి. మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సుల్లో మంచి కాలేజీల్లో సీటు రావాలంటే తొలి అడుగు ఇంటర్ కాబట్టి భవిష్యత్తును ఆచితూచి అడుగులు వేస్తూ ముందుకు సాగాల్సిన సమయం ఇది.

వ్యసనాలే ప్రధాన శత్రువు

కొత్త స్నేహాలు కొత్త అలవాట్లకు దారి తీస్తాయి. ఈ క్రమంలో ఏది మంచో.. ఏది చెడో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. వివిధ ప్రాంతాల నుంచి వరంగల్, హనుమకొండ నగరాలతో పాటు మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి, పరకాల, ములుగు, తొర్రూరు లాంటి పట్టణాలకు చదువు కోసం విద్యార్థులు రావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు ఏమాత్రం దగ్గరవ్వద్దు. ప్రధానంగా సిగరెట్, మద్యం, గుట్కా వంటి వాటికి ఎంతదూరం ఉంటే అంత మంచిది. సెల్‌ఫోన్ విద్యార్థుల ప్రగతికి అవరోధంగా మారుతుంది. తరగతి గదుల్లో, చదువుకునే వేళల్లో అనవసరమైన కబుర్లకు అలవాటు పడేలా చేస్తుంది. చాటింగ్, అశ్లీలసైట్ల వైపు మనసు మళ్లితే అంతే సంగతులు. పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు ప్రేరేపించే అవకాశం ఉంటుంది. సినిమాల ప్రభావంతో స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయణమంటూ మనసు కలుషితం చేసుకోవద్దు. తల్లిదండ్రులు ఇచ్చే స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దు. ఇటీవల కాలంలో కాలేజీ విద్యార్థులే ఎక్కువగా గంజాయి, డ్రగ్స్ కేసుల్లో పట్టుబడుతున్నారు. ఇలాంటి ప్రమాదకర మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చూసుకోవాలి. ఒక్కసారి పోలీసు కేసు నమోదైతే ఇక జీవితంలో కొలుకోలేం. కాబట్టి కీలకమైన ఇంటర్ దశను విజయవంతంగా ఎదుర్కొనేందుకు విద్యార్థులు చదువుపై ధ్యాస.. భవిష్యత్తుపై ఆశతో అడుగులు వేయాలి.

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ కాలేజీలు, విద్యార్థుల వివరాలు		
జిల్లా	ఇంటర్ కాలేజీలు	విద్యార్థులు
వరంగల్	11	5,432
హనుమకొండ	09	7,566
మహబూబాబాద్	10	8,670
జనగామ	07	6,231
భూపాలపల్లి	05	2,856
ములుగు	08	4,654
మొత్తం	**50**	**35,409**

తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి..

కె.పావనికుమారి, ప్రిన్సిపాల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, జనగామ



ఇంటర్మీడియట్ దశ విద్యార్థులకు చాలా కీలకమైనది. అనేక రకాల అంశాలకు ఆకర్షితులయ్యే వయస్సు. ప్రధానంగా విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు బానిసలవుతున్నారు. దీనివల్లే విద్యార్థులకు చెడువ్యసనాలు ఏర్పడుతున్నాయి. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలి. మద్యం, సిగరెట్ వంటి వాటికి అలవాటు పడితే వెంటనే కౌన్సెలింగ్ ఇప్పించి, మంచిదారిలో నడిచేలా చూసుకోవాలి.

నడవడికలో మార్పు గమనించాలి

బరుపాటి గోపి, మనోవికాస నిపుణుడు, వరంగల్



ఇంటర్ చదివే విద్యార్థులు అప్పుడప్పుడే యుక్త వయస్సుకు వస్తుంటారు. ఈ దశలో విద్యార్థులు వేటికైనా త్వరగా ఆకర్షితులవుతారు. ఇంటర్ విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు ఎప్పటికీ గమనిస్తూనే ఉండాలి. ఏది మంచి.. ఏది చెడో వారికి వివరించాలి. ముఖ్యంగా చెడు స్నేహాలు, గాలి తిరుగుళ్లు లాంటివాటితో జరిగే నష్టాన్ని వారికి వివరించాలి. కాలేజీ ఆధ్యాపకులు విద్యార్థుల ప్రవర్తన తీరు గమనించి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలి.

ప్రమాదం.. ఇలా పసిగట్టొచ్చు!

- వాతావరణ పరిస్థితులపై ముందస్తు సమాచారం
- పలు యాప్‌లను తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం
- అప్రమత్తతతోనే సంపూర్ణ రక్షణ



ఆకాశంలో మెరుపు

మహబూబాబాద్ క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలను ముందస్తుగానే పసిగట్టే వీలుంది. పిడుగు, వర్షాలు, ఈదురుగాలుల లాంటి ప్రమాదాలను ముందే తెలుసుకోవచ్చు. పిడుగు ఎప్పుడు.. ఎక్కడ పడుతుందో తెలియక ప్రజలు, మూగజీవాలు మృత్యువాత పడుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాలను ముందస్తుగా తెలుసుకొనేందుకు దామినీ, మేఘదూత్, రెయిన్ అలారం లాంటి యాప్‌లను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌లతో ముందస్తుగా అప్రమత్తమై ప్రమాదం నుంచి పూర్తి రక్షణ పొందవచ్చు.

ఈ యాప్‌లపై అవగాహన లేని ప్రజలు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో ప్రతీ ఏటా పదుల సంఖ్యలో ప్రజలు, మూగజీవాల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. దీనిలో భాగంగా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మూడేళ్ల కాలంలో సుమారు 66 మంది ప్రజలు, 112 మూగజీవులు పిగుడు పడి మృత్యువాత పడగా, అనేకమంది గాయాల పాలైనట్లు విపత్తు నిర్వహణ అధికారులరికార్డులప్రకారం తెలుస్తోంది.

మూడేళ్లలో మృతి చెందిన వ్యక్తులు, మూగజీవాలు		
సం.	వ్యక్తులు	మూగ జీవాలు
2023	32	52
2024	20	35
2025	14	25
మొత్తం	**66**	**112**

దామినీ యాప్..

పిడుగు ఎప్పుడు.. ఎక్కడ పడుతుందో ముందస్తుగా పసిగట్టడం దామినీ యాప్ లక్షణం. సాధారణంగా వర్షాకాలంతో పాటు ఏప్రిల్, మే నెలల్లో పిడుగులు పడడం సహజం. వ్యవసాయ పనుల హడావిడిలో ఉండే రైతులు పిడుగు పడే సమయంలో దగ్గరలోని ఎత్తయిన చెట్ల కిందికో.. ఇరత ప్రదేశాలకు వెళ్తుంటారు. అవి అంత సురక్షితం కాదని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో రైతులను అప్రమత్తం చేసేదే దామినీ యాప్. దీనిని గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇది సమీపంలోని 20 కిలోమీటర్ల దూరంలో 5 నుంచి 20 నిమిషాల్లో ఎక్కడ పిడుగు పడుతుందో అప్రమత్తం చేస్తుంది. దీనివల్ల ప్రమాదం ముందస్తుగా పసిగట్టి సురక్షిత ప్రాంతాలకు వెళ్లొచ్చు.

మేఘదూత్ యాప్..

ఈదురుగాలులు, వాతావరణ సమతుల్యతను ముందస్తుగా పసిగట్టి సమగ్ర సమాచారం అందించేందుకు మేఘదూత్ యాప్ ఉపయోగపడుతుంది. పంట చేలకు ఎరువులు అందించాల్సిన సమయంలో లేదా వరి కోతల సందర్భంగా రైతులకు నష్టం చేసేవి వర్షాలే. దీనిని తప్పించేందుకు భారత వాతావరణ శాఖ మేఘదూత్ యాప్‌నకు రూపకల్పన చేసింది. గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటే తాజా సమాచారం తెలిసిపోతుంది. రాబోయే 5 రోజుల్లో వాతావరణ మార్పులు, వర్ష సూచనలు సహా ఆకాశం మేఘావృతం అవుతుందా! లేదా? గాలులు ఏ మేరకు ఎక్కడి నుంచి ఎక్కడికి ఏ దిశగా వీస్తాయో తెలుసుకోవచ్చు.

రెయిన్ అలారం..

చుట్టూ 20 కిలోమీటర్ల దూరంలో ఎప్పుడు.. ఎక్కడ వర్షం పడుతుందో మందస్తుగా తెలుసుకునేందుకు రెయిన్ అలారం యాప్ ఉపయోగపడుతుంది. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్‌లో రేయిన్ అలారం అని ఇంగ్లీషులో టైప్ చేస్తే ఈ యాప్ కనిపిస్తుంది. కేవలం ఒక నిమిషంలో డౌన్‌లోడ్ అవుతుంది. వినియోగదారుడు అందించిన వివరాల మేరకు అతను ఉన్న ప్రాంతానికి సమీపంలో 20 కిలోమీటర్ల దూరంలో ఎక్కడ వర్షం పడే సూచనలు ఉన్నాయో సమగ్ర సమాచారం క్షణాల్లో అందిస్తుంది. దీంతో వర్షం ముప్పు నుంచి ముందే జాగ్రత్త పడే అవకాశం ఉంటుంది.



ప్రకృతి వైపరీత్యాలను పసిగట్టే యాప్‌లు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- ఎత్తైన ప్రదేశాలు, చెట్ల కింద ఉండరాదు.
- విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి.
- ల్యాండ్, సెల్ ఫోన్ మాట్లాడకూడదు.
- విద్యుత్ సరఫరా అయ్యే ఇనుము, రాగి, ఇత్తడి, అల్యూమినియం లాంటి వస్తువులను తాకరాదు.
- వర్షంలో వంట సామగ్రి, బోళ్లు కడగవద్దు.
- ఇంట్లో నుంచి బయటకు వెళ్లరాదు.

ఇలా తగు జాగ్రత్తలు తీసుకుంటే పిడుగు పాటు నుంచి పూర్తి రక్షణ పొందవచ్చని నిపుణులు తెలుపుతున్నారు.



కుటుంబ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న వెన్నె కుటుంబాలు

కుటుంబ బలగం అపూర్వ సమ్మేళనం

- మరిపెడలో ఒకే వేదికపై కలుసుకున్న 208 మంది

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ విలేజీకి చెందిన ఓ కుటుంబ సమ్మేళనాన్ని శనివారం స్థానిక భార్గవ్ ఫంక్షన్ హాల్‌లో అపూర్వంగా జరుపుకున్నారు. స్థానికులైన వెన్నె శివమ్మ-పెద్ద సోమయ్య దంపతులకు ఎనిమిది మంది కుమార్తెలు, ముగ్గురు కుమారులు సంతానం కాగా, ఇద్దరు కుమార్తెలు మరణించారు. మిగిలిన తొమ్మిది మందికి వివాహాలు జరిపించారు. కొంత కాలం తర్వాత ఆ దంపతులు ఇద్దరు కాలం చేశారు. వీరి కుమారులు, కుమార్తెలు, అల్లుళ్లు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లు అందరూ శనివారం కుటుంబ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. మొత్తం 232 మంది కుటుంబ సభ్యులు కాగా, వివిధ కారణాలతో 24 మంది చనిపోయారు. మిగిలిన 208 మంది హాజరయ్యారు. శివమ్మ-సోమయ్య దంపతుల సమాధుల వద్ద శ్రద్ధాంజలి ఘటించి ఊరేగింపుగా ఫంక్షన్ హాల్‌కు చేరుకొని పిల్లా పాపలతో ఉల్లాసంగా గడిపారు. బాంధవ్యాలను గుర్తు చేసుకొని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెన్నె విశ్వనాథం, శ్రీశైలం, కర్నె సోమయ్య, విశ్వనాథం, సద్గుణమ్మ, బస్వమ్మ, సుగుణమ్మ, అంజనమ్మ, కర్నె లోకేశ్వర్, నాగరాజు, మహేశ్, నాగన్న, సోమన్న, సుధాకర్, కోటేశ్వర్‌రావు, ఉమామహేశ్వర్, నాగేంద్ర, భద్రకాళి, శ్రీవిద్య, మాధవి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

» హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్



గోవిందరావుపేట పీహెచ్‌సీలో మందుల నిల్వలను తెలుసుకుంటున్న హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్

గణపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని తెలంగాణ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ బి.రవీంద్ర నాయక్ అన్నారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది, ల్యాబ్ పరీక్షలు, ఫార్మసీ మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్ట్యా వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శ్రీదేవి, ప్రోగ్రాం ఆఫీసర్ ఉమాదేవి, ఎన్‌సీడీ అధికారి సందీప్, ఇమ్యూనైజేషన్ అధికారి ప్రమోద్, డీపీవో చిరంజీవి, డీడీఎం మధు, యూనిట్ ఆఫీసర్ రమేష్ తదితరులు ఉన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష

ములుగుటౌన్(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ సందర్శించారు. వైద్యాధికారులతో సమావేశమై సీజనల్ వ్యాధులపై సమీక్షించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై డీఎంహెచ్‌వో గోపాల్‌రావుతో చర్చించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. దోమలను లార్వ దశలోనే నిర్మూలించేందులకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో ఆర్ఎంపీలు, పీఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయకుండా నియమావళిని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్ కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి పవన్ కుమార్, వైద్యులు చంద్రకాంత్, శ్రీకాంత్, రణధీర్, సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆధికారి పూర్ణ సంపత్‌రావు, సిబ్బంది దుర్గారావు, సాంబయ్య, విజయ భాస్కర్, గణేష్, వెంకటరెడ్డి, కిరణ్, సురేష్ బాబు, వినోద్ పాల్గొన్నారు.

- గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): గోవిందరావుపేట మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్ తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, ఫార్మసీ, ల్యాబ్, లేబర్ గదిని పరిశీలించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, దోమల నివారణకు చేపడుతున్న ముందస్తు ప్రణాళిక గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో గోపాల్ రావు, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రకాంత్, సిబ్బంది ఉన్నారు.

ఎర్తింగ్‌తో విద్యుత్ ప్రమాదాలకు చెక్

- వర్షాకాలంలో షార్ట్‌సర్క్యూట్‌లు జరుగకుండా నివారణ
- ఎంసీబీ, ఆర్‌సీసీబీలతో కరెంట్ లీకేజీలకు అడ్డుకట్ట
- కనీసం ఐదేళ్లకోసారి వైరింగ్ మార్చుకోవాలంటున్న నిపుణులు

వరంగల్ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఇళ్లు కట్టుకుంటారు. విద్యుత్ కోసం లక్షల రూపాయలు ఖర్చు పెడతారు. కానీ, విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలను ఎవరూ పెద్దగా పట్టించుకోరు. తద్వారా ఏదైనా ప్రమాదం సంభవిస్తే కోట్ల రూపాయల ఆస్తితో పాటు ప్రాణ నష్టం జరుగుతుంది. అందువల్ల ఇళ్లు, షాపులు, అపార్ట్‌మెంట్ భవనమైనా నిర్మించే సందర్భంలో తగిన సామర్థ్యంతో ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

టీజీఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ పరిధిలో మొత్తం 2,06,845 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వాటిలో గృహ విద్యుత్ అవసరాల కోసం 1,71,335 కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ ప్రమాదాల తీవ్రత తగ్గించేందుకు ప్రతీ భవనానికి ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలనే నిబంధనలు ఉన్నాయి. విద్యుత్ ఎర్తింగ్ ముఖ్యంగా మూడు రకాలుగా ఉంటాయి. అవి పైప్ ఎర్తింగ్, ప్లేట్ ఎర్తింగ్, స్ట్రిప్ ఎర్తింగ్. వీటితోపాటు న్యూట్రల్ ఎర్తింగ్ కూడా ఉంటుంది. జిల్లాలో ఎక్కువ శాతం భవనాలకు ఎర్తింగ్ పాయింట్లు లేవని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఇళ్లలో వినియోగించే విద్యుత్ సామర్థ్యం ఆధారంగా ఎర్తింగ్ పాయింట్లు ఏర్పాటు చేసుకోవాలని, ఎలక్ట్రికల్ సర్క్యూట్లను భూమికి అనుసంధానం చేస్తూ పైప్, ప్లేట్ ఎర్తింగ్‌తో భవనాల్లో ఎర్తింగ్ పాయింట్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని సూచిస్తున్నారు. పరిశ్రమలతో పాటు, అపార్టుమెంట్ల విద్యుత్ వైరింగ్ వ్యవస్థలో లోపాలను పరిశీలించేందుకు విద్యుత్ తనిఖీ విభాగం ఉన్నా.. గృహాలు, షాపుల్లో ఎలక్ట్రికల్ ప్రమాదాల నివారణకు ఎలాంటి ప్రత్యేక వ్యవస్థ లేదని, దీంతో తరచూ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయని, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నిబంధనల ప్రకారం కనీసం ఐదేళ్లకోసారి గృహాల్లో వైరింగ్‌ను తనిఖీ లేదా మార్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. సింగిల్ ఫేజ్, న్యూట్రల్ వైర్లు సమాన పరిమాణంలో ఉండేలా చూసుకోవాలంటున్నారు.



ప్లేట్ ఎర్తింగ్

ఎంసీబీ, ఆర్‌సీసీబీలు..

కరెంట్ సరఫరాలో లీకేజీను అరికట్టేందుకు ఎంసీబీ(మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్) ప్రతీ ఇంట్లో ఏర్పాటు చేసుకోవాలి. రెండు ఫేజ్‌లు కలిసినప్పుడు, ఓల్టేజీలో హెచ్చుతగ్గులు తలెత్తినప్పుడు ఎంసీబీ వెంటనే ట్రిప్పయి కరెంట్ సరఫరా నిలిచిపోతుంది. ఇళ్లలో మెట్రో కరెంట్ ఇన్‌స్టలేషన్ లీకేజీలను అరికట్టేందుకు ఆర్‌సీసీబీ(రెడ్యువల్ కరెంట్ సర్క్యూట్ బ్రేకర్) ఏర్పాటు చేసుకోవాలి. చాలా ఇళ్లలో ఆర్‌సీసీబీలు ఏర్పాటు చేసుకోవడం లేదు. ఆర్‌సీసీబీ ఏర్పాటు చేసుకుంటే షార్ట్‌సర్క్యూట్ అయితే వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. రెండేళ్లకోసారి ఇళ్లలో వైరింగ్ సామర్థ్యాన్ని తనిఖీ చేయించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

పైప్ ఎర్తింగ్..

పైప్ ఎర్తింగ్ కోసం 38 మీ.మీ. వ్యాసం, రెండు మీటర్ల పొడవు గల పైపును సాధారణంగా ఉపయోగిస్తారు. దీనిని 2-3 మీటర్ల లోతులో భూమిలో పాతిపెడతారు. పైపు చుట్టూ బొగ్గు, ఉప్పు వేసి తేమను నిలుపుకోవడం ద్వారా ఎర్త్ రెసిస్టెన్స్‌ను తగ్గిస్తారు. పైప్ ఎర్తింగ్ ఇంటి విద్యుత్ వ్యవస్థలు, పారిశ్రామిక విద్యుత్ వ్యవస్థలు, ట్రాన్స్‌మిషన్ టవర్ల వంటి వివిధ అనువర్తనాల్లో ఉపయోగిస్తారు. ఇది ముఖ్యంగా తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలకు, తేమ తక్కువగాఉన్నప్రాంతాలకు అనుకూలంగా ఉంటుంది. ఇది తక్కువ ఖర్చుతో కూడుకున్నది. విద్యుత్‌షాక్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది.

స్ట్రిప్ ఎర్తింగ్..

స్ట్రిప్ ఎర్తింగ్ అనేది తక్కువ నిరోధకత కలిగిన మెటాలిక్ స్ట్రిప్ ద్వారా విద్యుత్ ఉపకరణాల నుంచి భూమికి విద్యుత్‌ను ప్రసారం చేసే ప్రక్రియ. ఈఎర్తింగ్ కోసం గాల్వనైజ్డ్ స్టీల్ లేదా కాపర్ స్ట్రిప్స్‌లను ఉపయోగిస్తారు. విద్యుత్ ఉపకరణంలో ఏదైనా లోపం సంభవించినప్పుడు అధిక విద్యుత్ ప్రవాహం ఎర్తింగ్ సిస్టమ్‌లోకి వెళుతుంది. ఈ స్ట్రిప్ ఎర్తింగ్ ద్వారా విద్యుత్ ప్రవాహం భూమిలోకి సురక్షితంగా ప్రవహించి విద్యుత్ షాక్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. స్ట్రిప్ ఎర్తింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేటప్పుడు నిపుణుల సలహాలు తీసుకోవడం చాలా ముఖ్యమని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.



స్ట్రిప్ ఎర్తింగ్




పైప్ ఎర్తింగ్

ప్లేట్ ఎర్తింగ్..

ఈ ప్లేట్ ఎర్తింగ్ పద్ధతిలో (60-60 సెంటీమీటర్లు) కొలతలు కలిగిన ప్లేటును 60 సెంటీమీటర్ల లోతులో భూమిలో పాతిపెడతారు. దీనిలో 6.3 మీ.మీ. లేదా 3.15 మందం గల గాల్వనైజ్డ్ స్టీల్ ప్లేట్ లేదా రాగి ప్లేట్‌ను ఉపయోగిస్తారు. ఈ ప్లేటును గుంతలోకి నిలువుగా ఉంచి దాని చుట్టూ బొగ్గు, ఉప్పు వేసి ఎర్త్ వైర్‌ను కనెక్ట్ చేస్తారు. అనంతరం గుంతను మట్టితో కప్పుతారు. ఇది తుప్పు పట్టకుండా ఉంటుంది. దీని ద్వారా భూమిలోకి తక్కువ నిరోధకత మార్గాన్ని అందిస్తుంది. తద్వారా విద్యుత్ షాక్ ప్రమాదాన్ని తగ్గించి విద్యుత్ పరికరాలను సురక్షితంగా ఉంచుతుంది.

ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి



వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తాయి. పలు గృహల్లో ఏసీలు, గీజర్లు ఏర్పాటు చేసుకుంటున్నా భవనాలకు ఎర్తింగ్ ఉందా, లేదా అనే విషయం పట్టించుకోవడం లేదు. ఏసీలు, గీజర్లు, వాషింగ్ మెషిన్, రిఫ్రిజిరేటర్లు, ఓవెన్లు లాంటివి ఉన్న ఇంటిలో ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. దీంతో 90 శాతం విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా అరికట్టవచ్చు.

– శెంకేసి మల్లికార్జున్, డీఈ ఆపరేషన్స్, వరంగల్ జిల్లా

పల్లాను పరామర్శించిన రవిచందర్‌రెడ్డి



హైదరాబాద్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న రవిచందర్‌రెడ్డి

కేసముద్రం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవలె కాలికి గాయంతో శస్త్రచికిత్స చేయించుకొని హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన్ను శనివారం కేసముద్రం మండలం తాళ్లపూసపల్లికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రావుల రవిచందర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని రవిచందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఉమామహేశ్వర్‌రావు, ఏకాంబరం ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)హాల్‌లో శనివారం ప్రగతి హైస్కూల్ 2001-02 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు విద్యాబోధన చేసిన గురువులు జానకిరాములు, సురేష్, హిమాముద్దీన్, గోపి, పద్మలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. చిన్ననాటి పాఠశాలలో చేసిన తీపి గుర్తులను గురువులకు గుర్తు చేస్తూ ఆనందంగా గడిపారు. ప్రస్తుతం వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన వారి వివరాలను గురువులకు వివరించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరరలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులే కాపాడుకోవాలి

కేసముద్రం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కానుగంటి హన్మంతరావు అన్నారు. కేసముద్రం వీసీబీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ఉపాధ్యాయుల పాత్ర అంశంపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు పెంటయ్య, నాగరాజు, గోపికృష్ణ, శ్రీనివాస్, సోమనర్సయ్యచారి, సంతోష్, వెంకటాచార్యులు, వాణిదేవి పాల్గొన్నారు.

ఎర్రబెల్లిగూడెంలో విద్యుత్ కోతలు నివారించాలి

నెల్లికుదురు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఎర్రబెల్లిగూడెంలో విద్యుత్‌కోతలు నివారించాలని మాజీ సర్పంచ్ బొమ్మెర ఎల్లగౌడ్ తెలిపారు. ప్రతిరోజు 6 గంటల పాటు విద్యుత్ సరఫరాలేకపోవడంతో వ్యవసాయానికి, నాట్లకు రైతులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. ఇండ్లలో విద్యుత్ సరఫరాలేకపోవడంతో ఫ్యాన్‌లు తిరగడంలేదన్నారు. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా కొనసాగించాలన్నారు. విద్యుతు కోతలు విధిస్తే సబ్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, అశోక్, కిషన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీల అభ్యున్నతి



మాట్లాడుతున్న ముసలయ్య

బయ్యారం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో బీసీ కులస్తుల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య అన్నారు. బయ్యారంలో శనివారం ఆయన మాట్లాడుతూ బీసీ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీలు రాజకీయంగా మరింత అభివృద్ధి చెందేలా జనాబా నిష్పత్తిలో 42 శాతం వాటా ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. అంతేకాక ఇప్పటికే పలు సంక్షేమ పథకాల అమల్లో ప్రాధాన్యత కల్పిస్తూ బీసీలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు, బీసీ సంఘ నాయకులు బండారి మల్లయ్య, రాసమల్ల నాగేశ్వరరావు, కేతమల్లు, శ్రీనివాస్, వీరలక్ష్మి, దేవేశ్వరరావు, అశోక్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

'ఇళ్లకు వెళ్లేందుకు దారి కల్పించాలి'

● పురుగుమందు డబ్బాలతో మహిళల నిరసన

డోర్నకల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ముల్కలపల్లిలోని 2వ వార్డు పరిధిలో నివాసముంటున్న ఇళ్లకు అదే కాలనీలో నివాసముండే తుల్లూరి అప్పమ్మ అనే మహిళ దారి బంద్ చేసింది. దీంతో తమ ఇళ్లకు వెళ్లే మహిళలు దారి సౌకర్యం కల్పించాలని కోరుతూ.. శనివారం రోడ్డుపై బైఠాయించి పురుగుమందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తాము ఎప్పట్నుంచో తమ ఇళ్లకు ఈ దారివెంటనే వెళ్తున్నామని, ఇప్పుడు అప్పమ్మ ఆ స్థలం నాది అంటూ, దారి బంద్ చేయడంతో.. తమకు వెళ్లేందుకు మరో దారి లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రామపెద్దలు ఆ స్థలం రోడ్డుమార్గమని చెప్పినప్పటికి అప్పమ్మ అవేమి పట్టించుకోకుండా దారి బంద్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై వంశీధర్ సిబ్బందితో ముల్కలపల్లికి వెళ్లి ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడారు. ఇరువర్గాల వారికి నచ్చజెప్పి మహిళల నిరసన విరమింప చేశారు.

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ రాంచందర్‌నాయక్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డోర్నకల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఆర్డినెన్స్‌ను జారీ చేసినందుకు గాను శనివారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచందర్‌నాయక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్‌పట్టణ అధ్యక్షులు సుమీర్‌చంద్‌జైన్, నాయకులు కోటిలింగం, మాదశ్రీను, శీలం శ్రీనివాస్, బాస్కర్, హరికృష్ణ, శంకర్, ఖాదర్‌బాబా, ప్రవీన్, తారాచంద్, నందానాయక్ పాల్గొన్నారు.

అర్హత లేని వైద్యం.. ప్రాణాలతో చెలగాటం

● తొర్రూరులోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అబార్షన్లు
● అర్హతలు లేకుండానే చికిత్సలు
● భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
● పట్టించుకోని సంబంధిత అధికారులు



లింగనిర్ధారణ పరీక్షలపై ప్రైవేటు ఆస్పత్రిలో విచారణ చేస్తున్న చైల్డ్‌లైన్ అధికారులు (ఫైల్)

తొర్రూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కొందరు ఎలాంటి అర్హతలు లేకున్నా వైద్యం చేస్తోండడంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుంది. జిల్లాలో ఏకైక రెవెన్యూ డివిజన్‌గా ఉన్న తొర్రూరులో ప్రైవేటు ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. దీనికి తోడు వైద్యశాఖ అధికారులే వాటిని ప్రారంభిస్తుండడంతో ప్రజలు మరింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అర్హతలేని వైద్యం, అనుమతులు లేకున్నా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రుల పర్యవేక్షణను పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో యథేచ్ఛగా వైద్యులు ఆర్ఎంపీలను ఏర్పాటు చేసుకుని అర్హతలేని వైద్యం చేస్తున్నారు.

వరుస సంఘటనలు

గత కొంత కాలంగా తొర్రూరు డివిజన్ పరిధిలో వరుస సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈసంవత్సరం జనవరి నుంచి ఇప్పటివరకు డివిజన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా అబార్షన్లు, అర్హత లేని వైద్యం వల్ల ముగ్గురు వ్యక్తులు చనిపోయిన సంఘటనలు నెలకొన్నాయి. 2023 అక్టోబర్ నెలలో తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం వికటించి మహిళ మృతి చెందింది. అప్పటి నుంచి పట్టణంలో వరుస సంఘటనలు జరుగుతున్నాయి.

మార్చి 21వ తేదీన ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అబార్షన్ చేస్తున్నారనే నేపథ్యంలో జిల్లా చైల్డ్ లైన్ అధికారులు సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి పోలీసుల సాకారంతో కేసు నమోదు చేయించారు. ఏప్రిల్ 2వ తేదీన పిల్లల ఆస్పత్రిలో నెలల బాలుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మే 5వ తేదీ మరో ఆస్పత్రిలో వైద్యులు అర్హత లేని వైద్యం చేయడంతో మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన 15 సంవత్సరాల బాలుడు మృతి చెందడంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో కొందరు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు చొరబడి బాధితులకు నచ్చజెప్పి ముడుపులు ఇస్తూ రాజీ చేస్తున్న సంఘటనలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా వైద్యశాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గత రెండు రోజుల కిందట పట్టణంలోని మరో ఆస్పత్రిలో అర్హతలేని వైద్యం చేయడంతో కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన పొన్నం పాండురంగ మృతి చెందాడు. దీంతో బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తే పెద్దమనుషులు రాజీ కుదిర్చడంతోనే ఎలాంటి కేసులు నమోదు కావడం లేదు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం
డాక్టర్ రవిరాథోడ్, జిల్లా వైద్యాధికారి

ప్రైవేటు ఆస్పత్రుల్లో వరుస సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ఆస్పత్రులపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇటీవల జరిగిన సంఘటన నేపథ్యంలో మీడియాలో వచ్చిన కథనాల మేరకు ఆయా ఆస్పత్రులకు నోటీసులు అందించడం జరిగింది. చట్టరీత్యా లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం. అనుమతులు లేకుండా అర్హత లేని వైద్యం చేస్తే అలాంటి ఆస్పత్రులను సీజ్ చేస్తాం. తొర్రూరు డివిజన్ పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులతో మీటింగ్ ఏర్పాటు చేసి ఆదేశాలు జారీ చేస్తాం. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్టం వచ్చిన రీతిలో అర్హత లేని వైద్యం చేస్తే కేసులు తప్పవు



సర్టిఫికెట్స్‌ను అందుకుంటున్న శిక్షణ పొందిన మహిళలు

నైపుణ్య శిక్షణలను వినియోగించుకోవాలి

తొర్రూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న నైపుణ్య శిక్షణలను యువతులు వినియోగించుకోవాలని సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి అన్నారు. శనివారం తొర్రూరులో శ్రీవాణి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బ్యూటీషియన్, ఇతర శిక్షణ కోర్సులను పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో కుటుంబ పోషణకు మగవారి సంపాదనే కాక ఆడవారు కూడా కుటుంబాన్ని ఆదుకునేందుకు తమవంతు కర్తవ్యాన్ని నిర్వహించుకోవచ్చన్నారు. మహిళలు శిక్షణను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కరుణ, శ్రీకాంత్, రవీందర్, శివ, లక్ష్మి, ప్రీతి తదితరులు ఉన్నారు.

రక్తదానం చేసి.. మరొకరి ప్రాణాలను కాపాడండి

● ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ పీవీ ప్రసాద్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రసాద్

మహబూబాబాద్ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని, రక్తదానం చేసి మరొకరి ప్రాణాలను కాపాడాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) జిల్లా చైర్మన్ పీవీ. ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ఆవరణలో మహబూబాబాద్ మండల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 45 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ పీవీ. ప్రసాద్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో రక్తం దొరక్క ప్రాణాలు వదులుతున్నారని రక్తదానం చేసి అలాంటి వారి ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి నష్టం ఉండదని, మళ్లీ పక్షం రోజుల్లో రక్తం వస్తుందని చెప్పారు. ముఖ్యంగా యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం మండల అధ్యక్షుడు పమ్మి సనాతనచారి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్, మోత్కూరి శంకర్, వంగాల పూర్ణచారి, పెండోట హరి, పమ్మి నాగబ్రహ్మచారి, లయన్స్ బాధ్యులు కొండపల్లి కేశవరావు, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, వైద్యులు వి.జగన్మోహన్‌రావు, అర్జున్‌రెడ్డి, రాజ్‌కుమార్, హితేష్ కుమార్, అనుమాల వెంకటేశ్వర్లు, సిద్ధార్థ, సాదుల సురేష్, మాలె కాశీనాథ్, ఆల్‌టెక్ రమేష్ పాల్గొన్నారు.

డాక్టరేట్ పట్టా అందుకున్న ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేష్‌ను సన్మానిస్తున్న డోలి సత్యనారాయణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ఈ నెల 7న డాక్టరేట్ పట్టాను అందుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు మద్దెర్ల రమేష్‌ను ఘనంగా సన్మానించారు. మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో శనివారం రమేష్‌ను నలంద విద్యాసంస్థల కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డోలి సత్యనారాయణ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మద్దెర్ల రమేష్ వరంగల్ కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకోవడం సంతోషకరమన్నారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎమ్డీ ఫరీద్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, కేబీ శంకర్, కృష్ణారావు, బుర్ర గోవర్ధన్ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి



కొత్తగూడలో మాట్లాడుతున్న భూర్క యాదగిరి

కొత్తగూడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్న అటవీ శాఖ అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూర్క యాదగిరి డిమాండ్ చేశారు. కొత్తగూడలో శనివారం నిర్వహించిన తుడుందెబ్బ, ఆదివాసీ ఉద్యోగుల సంఘం, ఆదివాసీ సంఘాల సమావేశంలో యాదగిరి మాట్లాడారు. భూములను సాగు చేసుకుంటున్న ఆదివాసీ రైతులపై అటవీశాఖ అధికారుల దాడులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పోడు భూములకు హక్కుపట్టాలు ఇవ్వాలన్నారు. జీవో 3ను పునరుద్ధరించే వరకు, ఏజెన్సీ హక్కులు, చట్టాలు అమలు చేసే వరకు ఆదివాసీ సంఘాల ఐక్యంగా నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కొత్తగూడ, గంగారం మండలాల్లోని గూడాలలో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి మల్లెల రాము, మండల అధ్యక్షుడు పూనెం సందీప్ కుమార్, మండల నాయకుడు పెనుక సతీష్, ఆదివాసీ ఉద్యోగులు వట్టం సాయిలు, కల్తీ ఎల్లయ్య, చుంచ సారయ్య దొర, సువర్ణపాక సమ్మయ్య, పూనెం రాంచందర్, వాసం కిషిందర్, జెజ్జరి శివకృష్ణ, ఈసం నర్సింగరావు, పుల్సం సాంబయ్య, పూనెం పూర్ణచందర్, ఈసం రంగారావు, తాటి సుదర్శన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

పెద్దవంగర, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యా వనరుల కేంద్రంలో సీఆర్పీగా పని చేస్తున్న వేముల సంతోష్ భార్య వేముల ఝాన్సీ (35) ఇటీవల మరణించడంతో (జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు) తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. శనివారం మండల అవుతాపురం గ్రామంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. మృతురాలి కుమార్తె పేరు మీద తోటి ఉద్యోగులు పోస్ట్ ఆఫీస్‌లో రూ.50వేలను ఫిక్స్ డిపాజిట్ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ చిన్న వయస్సులో ఝాన్సీ మరణించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు బుదారపు శ్రీనివాస్, మహంకాళి బుచ్చయ్య, సమగ్ర శిక్ష ఉద్యోగులు రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేష్, జానకిరాములు, జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఉపాధ్యక్షుడు బాబులాల్, సీఆర్పీలు రంగన్న, రమేష్, నిరంజన్, అనిల్, శ్రీనివాస్, బాలాజీ, వీరస్వామి, రవి, రమేశ్ పాల్గొన్నారు.

'అనారోగ్య' ఆహారం..

(5వ పేజీ తరువాయి)

చికెన్ పీస్‌లో పురుగులు ప్రత్యక్షమవ్వడమే ఇందుకు నిదర్శనం. అలాగే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో రుచితో ఆకట్టుకునేందుకు ఆరోగ్యానికి హాని కలిగించే కల్తీ సరుకులతోనే తినుబండారాలు, ఆహారపదార్థాలు తయారు చేస్తున్నట్లు సమాచారం.

కనిపించని నాణ్యత..

జిల్లా కేంద్రంతో పాటు మరిపెడ, తొర్రూరు, కురవి, డోర్నకల్, గార్ల, కేసముద్రం, గూడూరు, కొత్తగూడ మండల కేంద్రాలతో పాటు ఇతర ప్రధాన కూడల్లో పుట్టగొడుగుల్లా వెలసిన ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీ సెంటర్ల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్కడ తయారు చేస్తున్న ఆహార పదార్థాలు నూడుల్స్ ఫ్రైడ్‌రైస్, చికెన్ ఫ్రైడ్‌రైస్, మంచూరియా, వెజ్ అండ్ నాన్‌వెజ్ బిర్యానీ తయారీలో నాసిరకం నూనెలు, నాణ్యత లేని ఇతర సరుకులను వినియోగిస్తూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీ సెంటర్లపై నిఘా పెంచి ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారుల పర్యవేక్షణ కరువు..

విచ్చలవిడిగా ఏర్పడిన బిర్యానీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కరువైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల నిఘా కొరవడడంతో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో అపరిశుభ్రత తాండవిస్తోంది. మురుగు కాల్వలు, నీటి ప్రవాహం పక్కనే ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వేడిచేసిన నూనెను మళ్లీ వాడడం, వాడిన కోడిగుడ్ల చెత్త పక్కన వేస్తుండడంతో వాటిపై ఈగలు, దోమలు వాలుతున్నాయి. ఆ ఆహారాన్నే విక్రయాలు జరుపుతుండడంతో ప్రజల ఆరోగ్యాలకు హాని కలుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఫాస్ట్‌ఫుడ్, బిర్యానీ సెంటర్లపై నిఘా పెట్టి నిత్యం తనీఖీలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఉప్పరగూడెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నరేష్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దవంగర, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నరేశ్ అన్నారు. శనివారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామ పంచాయతీలో జనవికాస ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేశ్, మాజీ ఎంపీటీసీ వేముల వెంకన్న మాట్లాడుతూ ఆహార పదార్థాల నిల్వల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వంటకు ఉపయోగించే నీరు, తాగును పరిశ్రుభంగా ఉంచాలన్నారు. ప్రతీ ఒక్కరు వ్యకిగత పరిశుభ్రతో పాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జన వికాస కో-ఆర్డినేటర్ మద్దెల రమ, వైద్యులు రాధాకృష్ణ, కిరణ్, కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



పాల్కూరికి సోమనాథుడి స్మృతివనాన్ని సందర్శిస్తున్న బీజేపీ నాయకులు

సోమనాథుడి స్మృతివనాన్ని ఉపయోగంలోకి తేవాలి : బీజేపీ

పాలకుర్తి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : తొలి తెలుగు విప్లవ కవి, పాల్కూరికి సోమనాథుడి స్మృతివనాన్ని వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలని భారతీయ జనతాపార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'సోమనాథా.. మన్నించు' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి బీజేపీ నాయకులు కమ్మగాని శ్రీకాంత్, మాజీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్, మండల అధ్యక్షుడు మారం రవికుమార్ ఆధ్వర్యంలో స్మృతివనాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ప్రాంత కవులు, రచయితల కోసం నిర్మాణం చేపడితే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ ప్రాంతానికి చెందిన వర్ధమాన కవులను తయారు చేయడానికి, కవి సమ్మేళనాలను ఏర్పాటు చేయడానికి పాల్కూరికి పేరుతో నిర్మించిన స్మృతివనం ఆలనాపాలనా లేక అధ్వానంగా తయారైందని విమర్శించారు. స్మృతివనం గదుల్లో మందు సీసాలు, సిగరేట్ డబ్బాలు, పగిలిన సీసాలు, పేడతో నిండిపోయిందని వాపోయాడు. కలెక్టర్ సందర్శించి, దీనిని వినియోగంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో వేల్పుల దేవరాజ్, పబ్బ సంతోష్, మచ్చ సునిల్, కేరళ కర్ణాకర్, శ్రీనివాస్ ఉన్నారు.

బడే నాగజ్యోతి పర్యటన

మంగపేట (ఆంధ్రజ్యోతి) : జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి మండలంలో పర్యటించారు. కమలాపురం, గంపోనిగూడెం, మంగపేట, బోరునర్సాపురం, చెరుపల్లి, తిమ్మంపేట, మల్లూరు, మొట్లగూడెం తదితర గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. అనారోగ్యాలతో బాధపడుతున్న పార్టీ కార్య కర్తలను కలిసి బాగోగులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మం డల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కుడుముల లక్ష్మీనారాయణ, గుండేటి రాజు యాదవ్, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి గుడివాడ శ్రీహరి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు తుమ్మ మల్లారెడ్డి, జగదీశ్, ఖుర్బాన్ అలీ, ఖాజాపాషా, మల్లూరు గుట్ట మాజీ చైర్మన్లు నూతలకంటి ముకుందం, పూజారి శ్రీనివాస్, మేడారం ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్ చిలుకమర్రి రాజేందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

రమేష్ కుటుంబానికి బీఆర్‌ఎస్ ఆర్థిక సాయం

గోవిందరావుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయి గ్రామా నికి చెందిన చుక్క రమేష్ ఇటీవల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోగా బీఆర్‌ఎస్ నాయకులు అతడి కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగ జ్యోతి, రెడ్కో మాజీ చైర్మన్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ వై.సతీష్‌రెడ్డి అక్కడికి చేరుకొని రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమకూర్చిన రూ.లక్షను బాధిత కుటుంబానికి ఆర్థికసాయంగా అందజేశారు. కాంగ్రెస్ నాయకుల వేధిం పులు భరించలేకనే చుక్క రమేష్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఆరో పించారు. రమేష్ కుటుంబానికి బీఆర్‌ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహ నాయక్, మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, గడదాసు సునీల్‌కుమార్, రామసహాయం శ్రీనివాసరెడ్డి, ఎమ్డీ.ఖాజాపాషా, తాడూ రి రఘు, ఈసం రామ్మూర్తి, పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, మోహన్‌రాథోడ్, జంపయ్య, రేగూరి రవీందర్‌రెడ్డి, వెలిశాల స్వరూప, పృథ్వీ, నాం పూర్ణచందర్, రమేష్‌రెడ్డి, శ్రీనివాస్, మాదరి రామయ్య తదితరులు పాల్గొన్నారు.